# "క్రొత్త మలుపు"

రచన : శ్రీ పూనాటి

డాక్టరు సత్యానందరావు సుస్తీగా వున్న ఒక బంధువును చూచివస్తూ రాత్రి 10 గంటల సమయాన 'బెల్లావెస్టా' వద్ద బస్సు దిగి యింటికి నడక సాగించాడు. "ఏరువాక" మలుపు తిరుగుతూ అక్కడెవరో ఇద్దరు సైకిళ్ళు పట్టుకొని ఉండడం గమనించాడు. ఆ మలుపు నుంచి జిల్లాపరిషత్ ఆఫీసు దాటేవరకు నివాస గృహాలేమి ఉండవు. అటువంటి సమయాలలో నిర్మానుష్యంగా ఉంటుంది. ఆ ఆఫీసుకు ఎదురుగా వున్న పెద్ద మర్రిచెట్టు నీడన ఆ ప్రాంతమంతా చీకటిగా ఉంటుంది. సత్యానందరావు పది అడుగులు వేశాడో లేదో వెనుకనుంచి ఎవడో చొక్కా పట్టుకున్నాడు. తాను "ఎవఁడా" అని వెనకకు తిరిగేలోపల ముందు నుంచి యింకొకడు పైపట్టుకున్నాడు. జేబులోనుంచి చిన్న కత్తి తీశాడు మొదటివాడు. "జాగ్రత్త! అరిచావంటే పీక తప్పించేస్తా, తీయ్, జేబులో ఏమున్నయ్" అన్నాడు. సత్యానందరావు తన అసహాయస్థితి తెలుసుకున్నాడు. పాకెట్‌లో చెయ్యిపెట్టి దడతో అందినవన్నీ తీసి, వాడి చేతిలో పోశాడు. రెండవవాడు డాక్టరు జేబు 'చెక్' చేశాడు. తరువాత ఆయన చేతివాచీ, చేతిలోనున్న స్టెతస్కోప్ గుంజుకున్నాడు. 'అది మీకెందుక'న్నాడు రావు 'స్టెతస్కోప్' చూసి, "ఎందుకా!" "ఇందుకూ" అంటూ బొటనవ్రేలును వంచిన చూపుడు వ్రేలి కేసి పైకి రానేడు నాణెం నాణ్యం చూచేట్లు. వెంటనే సైకిళ్ళుఎక్కి 'బెల్లావెస్టా' వైపు దౌడు తీశారు దోపిడీదారులు. 'ఏమి దారుణం?' అనుకుంటూ ముందుకు నడిచాడు సత్యానందరావు. అతని మదిలో నాలుగురోజుల నాడు జరిగిన సంఘటన మెదిలింది.

o o o

ఆనాడు సాయంకాలం 7 గంటలకు నేను,చంద్రం ప్రొఫెసర్ మూర్తి గారిని కలుసుకోవడానికి స్కూటరు మీద బయలుదేరాం. ఖైరతాబాదు మార్కెటువద్ద స్కూటరుఆపి "చంద్రం, చూస్తూండ వోయ్" అని ఎదుటిషాపులో షాంపూ తీసికొనేందుకు వెళ్ళాను. చంద్రం స్కూటరువైపు చూస్తూనే ప్రక్క అంగడిలో సిగరెట్టు అందుకున్నాడు. ఇంతలో. ఎవడో స్కూటరు రానుకుంటూ వెళ్ళినట్లయింది. నేను వచ్చి చూస్తే స్కూటరు తాళపు చెవులు లేవు. బండి 'లాక్' అయివుంది. "అరెరె! వాడు యిదుకు మూలాన రాసుకుంటూ వెళ్ళాడనుకొన్నానే గాని, 'రాస్కేల్' యిలా చేస్తాడని ఊహించలేక పోయా'నని చాల నొచ్చుకున్నాడు చంద్రం. అన్నివైపులా వెతికాము. ఏమి ప్రయోజనం? వాటినెవడో కొట్టుక పోయాడు. ప్రొఫెసరుగారిచ్చిన 'అపాయింట్ మెంట్' 8 గంటలకు. ఇప్పుడెలా చేరడం. "సరె, చంద్రం, నీవిక్కడే ఉండు. నేను పోయి రైల్వేగేటు దగ్గర తాళాలు తీసే వాడుంటాడు తీసుకొస్తానని "వెళ్ళాను.

తాళాలు, గొడుగులు రిపేరుచేసే ముసలి తాత ఎదుట తాళాలు తాళపు చెవులు ఒక గుట్టవేసుకొని కూర్చొని ఉన్నాడు. పాత గొడుగులు ఊచలు రైల్వే 'ఫెన్స్'కు తగిలించాడు. బక్కగా ఉన్నాడు. జుట్టు నెరసి ఉంది. ఒక చిన్నడబ్బా కొంక రంధ్రం చేసి దానిలో ఒక గుడ్డ వత్తి వేసి, తయారుచేసిన కిరోసిన్ దీపపు గుడ్డి వెలుగులో తాళాల 'డూప్లికేట్లు' చేస్తున్నాడు. సులోచనాల అవసరమున్నట్లు లేదు అతనికి. ప్రక్కన ఒక గిరాకీదారు 'హరెబుడే' (పచ్చిసెనగ మండలు) పట్టుకుని ఒక్కొక్క కాయి తింటూఉన్నాడు. తాతకు నా గోడు వినిపించాను. సాలోచనగా నా వైపు చూచి, "ఇప్పుడు ఎక్కడవు

తుంది" అన్నాడు. ఏలాగైనా సహాయం చేయాలని ప్రాధేయపడ్డాను. "చేతిలో పని కానీయండి. ప్రస్తుతానికి తాళం తీసి బండి నడిచేలాగ చేస్తాను. చాబీ రేపు చేసిస్తా"నన్నాడు. చేతిలో పని తొందరగా కావాలని కోరుకుంటూ అక్కడే నిలబడ్డాను, తాళాలు దొంగిలించిన వెధవని తిట్టుకుంటూ. నా తాళపు చెవి రింగులో వెంకటేశ్వరస్వామి బొమ్మ పొదిగిన బిళ్ళ గూడ ఉన్నది. ఆ మహానుభావుడన్నా వాడికి మంచి బుద్ధి పుట్టించి తాళాలు వాపసు ఇచ్చేలా చేయగూడదా అనుకున్నాను. ఇలా విపత్కర పరిస్థితులలో తమ హస్త లాఘవంతో జనాలను వేదించే ఈ వెధవలను దేవుడు ఎందుకు దండించడు? ఆ పాపిష్టి పని చేసేటప్పుడే చురక లాగ వాళ్ళకు ఏ తేలో, కందిరీగో కనీసం చీమగానో వెళ్ళి అంటిస్తే బుద్ధి రావచ్చు. అమాయకులకు ఇక్కట్లు తప్పుతాయిగదా. మొన్నమటుకు మొన్న కాన్పుకు ఇంటికి వెళ్ళిన భార్య 'సీరియస్'గా ఉందని విని నానా అవస్థలుపడి డబ్బు పోగుచేసుకొని స్టేషన్‌కు వెళుతున్నాడు వేణు. ఎలాగో ఉన్న మనసుతో పరధ్యానంతో ఉన్నాడేమో ఎవడో క్రూరుడు జేబులో ఉన్నవి మాయం చేశాడు. రైలు దాటిపోయింది. ఎన్నో బాధలుపడి తను మరునాడు ఊరు చేరుకొనేటప్పటికి అతని పారు స్వర్గం చేరుకుంది. ఆఖరు మాటకుకూడ తను నోచుకోలేదు. ఆ ముందురోజు శంకరం తమ్ముడు 'ఫైన్'తో "ఎగ్జామినేషన్ ఫీ" చెల్లించను ఆఖరురోజు చివరి గంటలో స్టేట్ బ్యాంక్‌లో కట్టేందుకు వెళ్ళి 'చలాన్' పట్టుకొని క్యూలో నిలబడ్డాడు. కౌంటరులో చలాన్ ఇచ్చి తన జేబు తడుముకుంటే ఏముందక్కడ? ఖాళీ జేబు. ఇంకొక సంవత్సరం ఖాళీ...అనిపించగానే కళ్ళ నీళ్ళు కారాయి అతనికి. ఈశ్వరాజ్ఞ లేనిదే గడ్డి పోచకూడా కదలదంటారే, వీళ్ళ దుష్కృత్యాలు దేవుడుచూస్తూ ఎందుకూరుకుంటాడు? దురంతాలు... తదనంతరం శిక్షలా?- ఏంటీ తంతు అంతా? అసలు తప్పులు జరగకుండా చేస్తే సరిపోతుంది గదా?

అసలు దేవుడున్నాడా? ఉంటే మరేంచేస్తున్నాడు?... వీటిని అర్థం చేసుకొనే శక్తి నాకు లేదా?- ఇలా లేచాయి నా ఆలోచనా తరంగాలు అంతరంగంలో. ఇంతలో "లాక్" అయిన సైకిలు తోసుకుంటూ ఇద్దరు యువకులు వచ్చారు తాళం కోసం. "ఒరిజినల్ లాక్" "అడయి రూప్యా"అవుతుంది తాళం ముప్పయి అయిదు పైసలు అవుతయి" అన్నాడు. కర్రవాళ్ళ మౌనం అంగీకారం క్రింద తీసుకున్నాడు తాత. చేతిలోవున్న పని ప్రక్కకు పెట్టి కిరోసిన్ దీపము చేతితో పట్టుకుని తాళాలగుట్ట రెండవ చేతి వేళ్ళతో దున్నుతున్నాడు దానికి తగిన తాళపుచెవి కోసరం. వెలుగు చాలడం లేదు. డబ్బాదీపం వంచి చూచాడు. దానిలో చమురు అయిపోగూడదనుకున్నాను. పని తొందరగా కావలయుననే తలంపుతో నేనుగూడ వంగి దానికి సరిపడగలవన్న తాళాలు అందిచ్చాను, file (ఆకురాయి) చేతికిచ్చాను. అతను సైకిలు తాళం తీయను ప్రయత్నిస్తున్నాడు. ఇంతలో ఒక మధ్య వయస్కుడు తూలుతూ రెండు పాత తాళాలు ఒక చెడిపోయిన తాళపు కుండీ తీసుకొని వచ్చాడు. "నేను గాను నూనె తీసుకపోతా. ఇవి తీసుకొని పైసలు ఇయ్ సేఠూ" అంటున్నాడు. అతని దగ్గర గుడంబా వాసన. తాత సైకిలు తాళం తీశాడు. వాళ్ళు ఆతని చేతిలో 25 పైసలు పెట్టారు. "కాదు, నేను ముందే చెప్పాను 35 అని" తాత వాపసుచేశాడు పైసలు; "అయితే నీ చాబీ తీసుకో" అని దురుసుగా తాళం 'లాక్' చేసి తాళపుచెవి విసిరి కుప్పలో పడేశాడు. సైకిలు త్రోసుకుంటూ వెళ్ళారు. తాత త్రాగినవాడు తెచ్చినవి చూచి, ఇవి 'ఖరాబున్నాయి. ఏమి వస్తవి వీటికి?' అంటూ అటు పడేశాడు వాటిని. మళ్ళా 'హరే బుడే' వాని పని పట్టుకున్నాడు. ఇంతలో సైకిలు వాళ్ళు మళ్ళావచ్చి తాళంచెవి ఇమ్మన్నారు. తాత మరల వెతకసాగాడు. నాకు యింకా ఆలస్యమై పోతుందే అని ఒకటే ఆరాటం. 'అయ్యో, పది పైసలు గురించి ఎంత చేశా

రండి' అన్నాను నేను. "అవును పైసలంటే పైసలే. మరి, అతడు 10 పైసలు తగ్గించకూడదా' అంటూ పైసలిచ్చి తాళం చెవి తీసికొనిపోయారు.

'నాకు పైసలియ్, సేతూ" అంటున్నాడు త్రాగిన వాడు. 'తాత 10 పైసలు ఇచ్చాడు' "ఏం సేతూ, ఇవాళ ఇవి దొరికినయి. నేను అప్పుడంతా మంచియ్ తేలేదా? టీన్ పైసలియ్, గాసునూనె కావాలి...నూనె ఇవ్వకపోతే వాడి గల్లా తీసేస్తా..."అంటూ బ్రతిమాలుతున్నాడు. నా టైం కాస్త అయిపోతున్నది. వీడి గోలన్నా తప్పిస్తే, తాతచేతిలో పని తొందరగా పూర్తిచేస్తాడని మిగిలిన 10 పైసలు నేనిచ్చా, వాడు వెళ్ళాడు.

''ఈ పది పైసల కొరకే గదా ఆ దుర్మార్గుడెవడో నా స్కూటరుతాళాలు పట్టుకపోవడం. నాకీ అవస్థ-' అనుకున్నాను. "బాబూ, కొంచెం బండి తాళంతీసి వస్తారు తాత" అన్నాను 'హరేబుటే' వానితో. "లేదండీ,' నేను అయిదు గంటలనుంచి కూర్చొనున్నా. దీన్ని గురించి" అన్నాడు. మొత్తానికి దీపం ఆరిపోకముందే తాత అతని తాళం తీసి ఇచ్చాడు. రెండు మూడు తాళపుచేతులు, పట్టుకారు, ఆకురాయి పట్టుకొని నాతో వచ్చాడు తాత. ''పైసలు కాదు ముఖ్యం. మనుషుల పనెల్లాలి, సార్. ఇబ్బందులు అందరికి వస్తయి' అన్నాడు తాత. అతడు నిజంగా ఆపద్బాంధవు డనిపించాడు. ఆ గంటసేపు ప్రతి సెకండు లెక్కపెట్టుకుంటూ అతని చేతివేళ్ళ వైపు చూస్తూ నేనుపడ్డ బాధ ఇప్పుడే గుర్తు కొస్తుంది.

ం ం ం

మరునాడు ఉదయం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ లో :

''వాట్, మిస్టర్, రావ్ రాత్రి 'బెల్లవెస్టా' సమీపాన విశ్వేశ్వరయ్య 'స్టాట్యూ' చౌరాస్తా దగ్గర 'ఫాటల్ యాక్సిడెంట్ (Fatal Accident)అయింది. తెలుసా'' అన్నాడు సివిల్ సర్జన్ కరుణాకరం. 'నో నాన్' "ఎలాగైంది, ఎవరు'' అడిగాడు డాక్టరు సత్యానందరావు.

"నేను పిక్చరు కెళ్ళి ఇంటికి వెడుతున్నా. టైం పది అవుతుంది. నా కారు ఇన్స్టిట్యూషన్ అఫ్ ఇంజనీర్స్ (Institution of Engineers) ముంగటగా వెళుతుంది. ముందు ఒకలారీ ర్యాష్(rash) గా వెళుతుంది. 'సడన్'గా 'ఏరువాక' సందు నుంచి ఇద్దరు కుర్రాళ్ళు సైకిల్సుమీద ముందు కురికారు" డాక్టరు రావుకు ఏదో స్ఫురణ కొచ్చింది "ఆ... ఏమైంది. వాళ్ళకు."

"ఒకడు లారీముందు చక్రాలక్రింద బడ్డాడు. అక్కడికక్కడే చితికి చచ్చిపోయాడు. రెండవవాడు లారీని ఢీకొని ప్రక్కకు పడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలు తగిలాయి. స్పృహతప్పింది లారీవాడు అలాగే దూసుకొని పోయాడు. అతని ప్రక్కన పడి ఉన్న (steth) చూచి ఏ (medico) మెడికోనో అనుకొని అక్కడ చేరిన ఒకరిద్దరు సహాయంతో వెంటనే హాస్పటల్ కు రష్ (rush) చేశాను."

"మరిలీగో మెడికల్ కేస్'... 'ఫార్మాలిటీస్' అండీ ?" అన్నాడు డాక్టరు రావు.

''అవన్నీ పెట్టుకుంటే అతని ప్రాణాలు పోయివుండేవి. వెంటనే నేనూ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ అటెండ్ (attend) అయ్యాము. అదృష్టవంతుడు. బ్రతకొచ్చు"

"నేను చూడాలండీ అతన్ని" అన్నాడు రావు.

"ఓహ్, అతన్ని మన వార్డులోనే ఉంచారు బెడ్ నంబరు సెవెన్. ఇంకా అతనికి స్పృహలేదు. బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ (Blood transfusion) ఏర్పాటు చేశాం. మీరు ఇతనికి స్పెషల్ అటెన్షన్ పే (Special attention pay) చేయాలి. కుర్రాడు బాగున్నాడు" అన్నాడు కరుణాకరం.

"ఓ. కే. బాస్" అని రావు వార్డువైపు చరచరా వెళ్ళాడు.

ఏడవనంబరు బెడ్‌లోని పేషెంట్‌ను చూచాడు. "వాడే వీడు. రెండవవాడు పోయాడన్నమాట!" అనుకున్నాడు. కేస్‌షీట్ చూచాడు.

ఆ రోజునుంచి అతని 'కండిషన్' ప్రతి క్షణం పరీక్షిస్తూ అవసరమైన రక్తం గ్లూకోజు ఇంజెక్షన్లు ఇచ్చి రాత్రింబవళ్ళు శ్రమపడి యువకుని ప్రాణం కాపాడారు. ఇందులో డాక్టరు రావు కృషి ఎంతో ఉంది. తెలివి వచ్చింది. కొద్దిరోజుల వరకు అతనికి గతం ఏమాత్రం గుర్తులేదు.

అతనిని చూడడానికి ఎవరు వచ్చినట్లే లేదు. అతని స్థితి మరికొంచెం మెరుగైన తరువాత డాక్టరు రావు అడిగారు. "బాబూ, నీ పేరేమి? మీ వాళ్ళెవరు లేరా?

"నా పేరు గోపాలం. మా అమ్మ నాన్న లేరు... అన్నలు ఇక్కడలేరు." అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"నీవు ఏంపని చేస్తావు. ఏమైనాచదువుకున్నావా?" ప్రశ్నించారు రావుగారు అతని వృత్తాంతం రాబట్టేందుకు. అతడు దుఃఖముతో మాట్లాడలేకపోవడం గమనించి అప్పటికి వదలివేశాడు.

ఒకరోజు రౌండ్సుకు వెళ్ళినప్పుడు సర్జన్ కరుణాకరం, "గోపాలం నీకింకేమి వరవాలేదు. కొద్ది రోజులలో డిస్చార్జి (discharge) చేస్తాం. మొత్తానికి లక్కీ ఫెలో(lucky fellow) వి డాక్టరు రావు నీకు చాల సర్వీస్ (service) చేశారు"

"ఆరోజు ఇతని ప్రక్క స్టెత్ (Steth) చూడకపోతే నేనాలాగే వెళ్ళి ఉండేవాడినేమో" అని రావు గారితో అంటూ కరుణాకరం అడిగారు.

"గోపాలం నీకా స్టెత్ (Steth) ఎక్కడిది?"

"గోపాలం ముఖం తెల్లబడింది. అతను పెదిమలు కదిల్చేలోపల, 'అది నాదేనండి. కొద్ది క్షణాలముందు నేనాదారిన వెళ్ళాను. జారిపోయిన నా స్టెత్ (Steth) ఇతనికి దొరికిందేమో" అన్నాడు డాక్టరు రావు.

'ఎంత మంచివాడు... నన్ను కాపాడాడు' మనసులోనే నమస్కరించాడు గోపాలం.

అతనికి కొంచెం శక్తి మనోదారుఢ్యం కలిగిన తరువాత డాక్టరు రావు అతన్ని గూర్చి అడిగారు, ఎందుకో అతనంటే అనక్తిచూపుతున్నాడు. గోపాలం తన తల్లిదండ్రులకు అందరికంటె చిన్నవాడు, తల్లికి అతనిపై అతి గారాభము. అన్నయ్యలు చక్కగా చదువుకొని చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు విశాఖపట్నంలో. నాన్నకు తెలియకుండా అమ్మ ఇచ్చే డబ్బుతో స్కూలుకు ఎగకొట్టి సినిమాలు చూడడం చెడ్డ సహవాసంలో అర్థమైన తిరుగుళ్ళు తిరగడం జరిగింది చదువు అబ్బలేదు. 10th క్లాసు రెండు మూడుసార్లు తప్పాడు. చిన్నఉద్యోగి తండ్రి గుండెపోటుతో పోయిన నెలకు, తల్లి గతించింది. ఆస్తిపాస్తులు లేవు. ఏపని రాదు. వేసేందుకు ప్రయత్నించలేదు. ఒకళ్ళిద్దరు స్నేహితులతో చేతులుకలిపి చేతికి అందినవి దొంగిలించి, సేఠ్ పాపాలాల్‌కు అప్పజెప్పడం, అతనిచ్చే పాతికో పరకో పెట్టుకొని కాలం గడపడం జరుగుతూవచ్చిందని చెప్పుకపోతున్నాడు గోపాలం. అతనికళ్ళలో నీరుబుకుతుంది. 'చివరకు మీ చేతిలోవి గుంజుక పారిపోయిన ఈ పాపి... వాడిలా పోవలసిందే... కాని మీరు కాపాడారు...' అని రావుగారి చేతులు పట్టుకున్నాడు గోపాలం. చెంపలవెంట నీరు ధారగా కారిపోతుంది. 'బాస్' ఈ 'పేషంట్' మీద చూపే ఇంటరెస్ట్ (Interest) మదిలో మెదలగా,

'గోపాలం, నీకేదైన పని దొరికితే చేస్తావా ?' అన్నాడు రావు.

"పాపంనుంచి బయటపడతా, మళ్ళా పుట్టాననుకుంటా' నని చేతులెత్తాడు.

గోపాలం డిస్చార్జి ప్రస్తావన వచ్చినప్పుడు అవకాశం ఇస్తే మనకు మంచి 'వార్డుబోయ్' కావచ్చునని రావు నర్సను కరుణాకరంగారికి సూచించడం జరిగింది.

'గోపాలం నీవు ఇప్పుడే డిస్చార్జి అవుతున్నావు. నా గదికి రా' అన్నారు డాక్టరు రావు ఇప్పుడెక్కడికెళ్ళాలి, ఏం చేయాలి .. తన గత జీవితం — ఆ లోకం కళ్ళముందు కదలాడింది. 'గోపాలం, ఇది నీ డిస్చార్జి సర్టిఫికేటు. ఇదినీ అపాయింట్‌మెంట్ ఆర్డరు (appointment order) అయ్యగారు నీకు వార్డు బోయ్ ఉద్యోగం ఇప్పించారు... శ్రద్ధగా పనిచేయి' అన్నారు.

"చేసి తరిస్తాను. నా పాపం కడుగుకుంటాను. మీరు నాకు బ్రతుకిచ్చారు" అని గోపాలం డాక్టరు రావు కాళ్ళు పట్టుకున్నాడు. కన్నీటిబొట్లు రావుకాళ్ళ మీద పడ్డాయి,

డాక్టరు సత్యానందరావు ఇదంతా తనకేమాత్రం అర్థంకాని అదృశ్యశక్తి యొక్క లీలా ?! అనుకున్నాడు.


# D. KRISHNAIAH B. E., M. I. E.,

ENGINEERS & CONTRACTORS

SPECIALISTS IN PREFAB BUILDINGS COMPONENTS & LOW COST HOUSES

**8-3-1005, SRINAGAR COLONY, HYDERABAD-500038.**

Phone : 34528

# SHRI KANAKA DURGA TRANSPORTS

*ROAD TRANSPORT CONTRACTOR*

**1867, PAN BAZAR, SECUNDERABAD-500 003.**

Phone : Office : 74081
Resi : 73?36

Prop : V. BHASKARA RAO